వ్యాధుల కాలం.. ఆహారం భద్రం

శుభ్రత లేని పదార్థాలతో ముప్పు

ఈ కాలంలో బయటి తిండి సరికాదు
ప్రజలకు వైద్య నిపుణుల హెచ్చరిక



మొయినాబాద్: ఇప్పుడంతా ఉరుకుల పరుగుల జీవితం. ఈ పరిస్థితుల్లో చాలా మంది తినే ఆహారంపై శ్రద్ధవహించడంలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్తే ఎక్కడ ఏది దొరికితే అది తినేసి కడుపు నింపుకునే పరిస్థితి వచ్చింది. తింటున్న ఆహారం ఎంత వరకు శుభ్రమైంది.. అందులో వాడుతున్న పదార్థాలు ఎలాంటివి.. ఎన్ని రోజులవి.. అనే విషయాలను చాలా మంది పట్టించుకోరు. వేడి వేడిగా తెచ్చారా.. తిన్నామా.. వెళ్లిపోయామా.. అన్నట్లుగా ఉంటుంది. వానాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. చాలావరకు మనం తినే ఆహార పదార్థాలతోనే వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ కాలంలో బయటి ఆహారం తినడం ఎంతవరకు భద్రమో ఆలోచించాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో అధికశాతం

హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న రంగారెడ్డి జిల్లాలో అధిక శాతం మంది బయటి ఆహార పదార్థాలు తినడానికే ఇష్టపడతారు. రోడ్ల పక్కన ఉండే చిన్న చిన్న బండ్లపై చేసే మిర్చీ బజ్జీ, పానీపూరి మొదలుకొని పెద్ద పెద్ద హోటళ్లలో బిర్యానీ వరకు లాగించేస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బయట తినే ఈ ఆహార పదార్థాలన్నీ ఎంతవరకు భద్రమో తెలియని పరిస్థితి. రోడ్ల పక్కన పానీ పూరీ, మిర్చీ బజ్జీ బండ్లు, ఉదయం పూట టిఫిన్ బండ్లు చాలానే ఉంటాయి. అక్కడే తినడం, పక్కనే చేతులు కడగడంతో నీళ్లు నిలిచి దుర్వాసన, ఈగలు, దోమలు వస్తుంటాయి. వాటితో బ్యాక్టీరియాలు తినే ఆహార పదార్థాలపై చేరే అవకాశం ఉంది. అలాంటి ఆహార పదార్థాలు తిన్నవారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నా కొన్ని బయటకు రావడంలేదు. హోటళ్లలోనూ ఇదే పరిస్థితి ఉంది. నగరానికి చేరువలో ఉండటంతో జిల్లాలో చిన్న హోటళ్లతోపాటు పెద్ద పెద్ద హోటళ్లు సైతం ఉన్నాయి. వాటిలో ఆహారం నాణ్యతగా ఉందో లేదో తెలియని పరిస్థితి. కొన్నిసార్లు బిర్యానీలో పురుగులు రావడం, కర్రీల్లో ఈగలు రావడం వంటి ఘటనలు జరిగాయి. అలాంటి జరిగినప్పుడు కస్టమర్లు హోటల్ నిర్వాహకులతో గొడవ పడి వెళ్లిపోతారు. కానీ హోటళ్లలో మాత్రం మార్పు రావడంలేదు.

అంతా ఇష్టారాజ్యం...

- చాలా హోటళ్లలో మాంసం రెండు, మూడు రోజులపాటు ఫ్రిజ్‌లో ఉంచి దాన్నే వండి వడ్డిస్తున్నారు.
- అల్పాహారాలకు అందించే గట్టి చట్నీని కొందరు రెండు మూడు రోజులు నిల్వ ఉంచి.. వీలును బట్టి అందులో నీళ్లు కలుపుతున్నారు.
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో చైనీ వంటకాల్లో వాడే పదార్థాలను ముందే సిద్ధం చేసి నిల్వ ఉంచుతున్నారు. అప్పటికప్పుడూ అందించాలంటే ఫ్రిజ్‌లో నుంచి తీసి వంటకంగా మారుస్తున్నారు.
- పాలు, పెరుగు విక్రయాల విషయంలోనూ నిర్ణీత వ్యవధి దాటినవే ఎక్కువగా విక్రయిస్తున్నారు. తీరా వినియోగదారులు ఇంటికి వెళ్లాకా.. రంగు మారడం, పగిలిపోవడం జరుగుతుంది.
- పానీపూరీ బండ్ల వద్ద పరిశుభ్రత ఉండడం లేదు. ఒకరికి వడ్డించిన చేతులతోనే మరికరికి పానీ పూరి వేస్తున్నారు.
- బేకరీల్లో తయారుచేసే కొన్ని రకాల కేకులు 24 గంటల్లోనే వినియోగించాలి. కానీ అలాంటివి ఎక్కడా అమలు కావడంలేదు.
- మిర్చీ బజ్జీలను వేయించే కడాయిల్లో నూను నల్లగా మారుతున్నా.. అందులోనే వేయిస్తున్నారు. చాలా మంది నాణ్యతలేని నూనెనే వాడుతున్నారు.

తనిఖీలు శూన్యం..

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో తిను బండారాలు, ఆహార పదార్థాలను తనిఖీ చేయాల్సిన ఆహార భద్రత అధికారులు ఎక్కడా కనిపించడం లేదు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే కొద్దిగా హడాహుడి చేస్తూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అన్ని రకాల ఆహార పదార్థాల్లో విచ్చలవిడిగా కల్తీలు జరుగుతున్నా, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకున్నా, నిల్వ పదార్థాలను యథేచ్ఛగా వాడుతున్నా అడిగే దిక్కేలేకుండా పోయింది. ఆహార భద్రత అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తనిఖీల విషయాన్నే మర్చిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జాతీయ పోషకాహార సంస్థ సూచనలు

- తోపుడుబండ్ల నిర్వాహకులు విధిగా చేతులకు గ్లౌజులు, నెత్తిన టోపీ ధరించాలి.
- దుమ్ము అధికంగా ఉన్నచోట, మురుగు కాల్వల పక్కన నిర్వహణ నిషేధం.
- ఆహార పదార్థాలపై మూతలు తప్పనిసరి.
- కవర్లను నోటితో ఊదకూడదు.
- మరుసటిరోజు కోసం ముందే కూరగాయలు, ఉల్లిగడ్డలు కోసి నిల్వ ఉంచొద్దు.
- ఆహార తనిఖీ బృందాల పర్యవేక్షణ అవసరం.
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- శుద్ధి చేసిన నీటిని వినియోగించాలి.

బయటి ఆహారం మానేయాలి



ఏ కాలంలో అయినా బయటి ఆహారం మంచిదికాదు. చాలామంది రోడ్ల పక్కన పెట్టే పానీ పూరీ, మిర్చీ బజ్జీ వంటివి తింటుంటారు. వాటితో రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు మరింత త్వరగా ప్రభలే అవకాశం ఉంటుంది. ఈ సయమంలో బయటి ఆహారం తీసుకోవద్దు. ఇంట్లో కూడా అన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.

–వెంకట్‌రెడ్డి, సీహెచ్‌ఓ, మొయినాబాద్ పీహెచ్‌సీ

క్లుప్తంగా

విద్యాసంస్థల నిర్వీర్యం కుట్రలను మానుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కొందుర్గు: ఎస్సీ గురుకుల విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని దళిత సంఘం నాయకులు దుగ్గని శ్రీనివాస్, ఆనంద్, దర్శన్, రాజు, బోయ ప్రశాంత్, మక్తల ఆనందం, వెంకటేశ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు మండలంలో ఉన్న గురుకుల బాలుర కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గురుకుల కళాశాలలో అధ్యాపకుల నియామకం జరగడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారని, అదేవిధంగా విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు, నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు

షాబాద్: మండలంలోని అంతారం పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గణేశ్‌రెడ్డి, ఖాజాపాషా, వాణిని పాఠశాల బృందం, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌గౌడ్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డేవిడ్‌రెడ్డి, కృష్ణ, గ్రామస్తులు బుచ్చయ్య, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, చంద్రశేఖర్, రాములు, పద్మారావు, శ్రీశైలం, ప్రవీణ్, మహిపాల్‌రెడ్డి, పవన్, పర్వతాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి బీరువాలు అందజేత



బీరువాలు అందజేస్తున్న సాయికుమార్, రామకృష్ణ

చేవెళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం చేవెళ్లకు చెందిన దాతలు భీమనపల్లి సాయికుమార్, చెనిగల రామకృష్ణలు ముందుకొచ్చి పర్యావరణ అవార్డు గ్రహీత పి.రామకృష్ణారావుతో కలిసి రెండు బీరువాలు అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఉపయోగపడే పరికరాలు, మందులు ఆస్పత్రికి సంబంధించిన సామగ్రి పెట్టుకునేందుకు ఉపయోగపడుతాయని వీటిని అందజేసినట్లు తెలిపారు. గతంలో కూడా రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆస్పత్రికి దాతల సహాయంతో ఫ్రిడ్జ్‌లను అందజేసినట్లు ఆస్పత్రి సిబ్బంది గుర్తుచేశారు. ఈ సందర్భంగా దాతలకు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు సాజియా, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సబితారెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాల్‌లో 99 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదన్నారు. పేదలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకునేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజ, ఆర్‌ఐ స్వర్ణకుమారి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీజెడ్సీ, ఎంజెడ్సీ, ఎంపీసీ, ఎంఎస్సీఎస్, ఎంపీసీఎస్, బీఏ, బీకాం, బీకాం (జనరల్) కోర్సుల్లో సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఖాళీలు భర్తీ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 5, 6 తేదీల్లో తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. మరిన్నీ వివరాలకు 7995660881 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పంచాయతీరాజ్ చేవెళ్ల డీఈగా గణేశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న గణేశ్

చేవెళ్ల: మండల పంచాయతీరాజ్ డీఈగా గణేశ్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన చేవెళ్ల పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈ విజయ్‌కుమార్ నుంచి నూతన డీఈగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా వచ్చిన డీఈ గణేశ్‌కు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

పంటలను కాపాడుకోవాలి

ఏరువాక కేంద్రం మహబూబ్‌నగర్ శాస్త్రవేత్త డా.భరత్‌భూషణ్

కొందుర్గు: అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని మహబూబ్‌నగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌భూషణ్ సూచించారు. షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఉత్తరాసిపల్లి, మహదేవ్‌పూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన అనంతరం పంట పొలంలో నిలిచిన వర్షపునీటిని తీసివేయాలన్నారు. ఎకరాకు 25 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పంటకు పైపాటుగా వాడాలని సూచించారు. ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13-0-45 మందును లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటకు లీటరు నీటికి 5 గ్రాములు 19:19:19 లేదా 20 గ్రాముల డీఏపీ మందును కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన అనంతరం పైపాటుగా ఎకరాకు 20కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మందును వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శోభారాణి, ఏఈఓ వాసవి, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేందర్‌రెడ్డి

చౌదరిగూడలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం, ఎల్కగూడ, పెద్దఎల్కిచర్ల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి పర్యటించి దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలను పరిశీలించి, పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: మొయినాబాద్‌లో ఉన్న శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. ఏమేమి వంటలు పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు రాకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, నాయకులు కేబుల్ రాజు, వినాజుద్దీన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పరిమితికి మించి తీసుకెళ్లొద్దు

ఎంఈఓ కార్యాలయంలో ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించటంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఏబీవీపీ నగర కార్యదర్శి మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ఏబీవీపీ నాయకులు వెళ్లి ప్రైవేట్ పాఠశాలలను తనిఖీలు చేసి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు పరిమితికి మించిన విద్యార్థులతో వెళ్తే రోడ్డుపక్కకు గుంతలోకి దూసుకెళ్లి ఆగిపోయి తృటిలో పెను ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే అన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ఎంతమంది తల్లిదండ్రులకు తీరని బాధలు మిగిలిస్తారన్నారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఎంఈఓ ఎప్పటికప్పుడూ ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని, స్కూల్ బస్సులు కూడా ఫిట్‌నెస్ ఉన్నాయా లేదా చూడాలని ఒక బస్సులో ఎంతమంది విద్యార్థులను తరలిస్తున్నారనేది కూడా పరిశీలించాలన్నారు. అనుభవం ఉన్న డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించాలన్నారు. పాఠశాలల యాజమాన్యలు సక్రమంగా స్పందించపోతే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల తీరు మారకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు ప్రదీప్, అనిల్, కిషోర్, శివ, విజయ్, నితీశ్, ప్రణయ్, హరీశ్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లు కూలిన బాధితులకు ప్రభుత్వ అండ

మొయినాబాద్: వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలకు ఇళ్లు కూలినవారు వెంటనే మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు కూలిన ఫొటో, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ దరఖాస్తుకు జత చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్లు కూలిన బాధితులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భూములు అమ్ముకోవద్దు.. భవిష్యత్‌లో కొనలేం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు

నందిగామ: రైతులు తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో అమ్ముకోవద్దని, ఉన్న భూములు ఇప్పుడే అమ్ముకుంటే భవిష్యత్ తరాలకు గజం స్థలం కూడా దొరకదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని చేగూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. పెద్ద, పెద్ద సంస్థలు, ట్రస్టులు, పరిశ్రమలు వందలు, వేల ఎకరాలను కొనుగోలు చేస్తూ సామాన్య రైతులకు భూములు లేకుండా చేస్తున్నారని, పరిస్థితి ఈ విధంగానే ఉంటే భవిష్యత్ తరాలకు భూములు ఉండని దుస్థితి నెలకొంటుందన్నారు. అదే విధంగా చెరువులు, కుంటలను ఎట్టి పరిస్థితుల్లో కబ్జా చేయొద్దని, శిఖం భూములు, బఫర్ జోన్లలో ఆక్రమణలు చేయొద్దని, ఎలాంటి కట్టడాలు చేపట్టొద్దని సూచించారు. చేగూరు శివారులోని ఓ కుంటలో అక్రమంగా గోడను నిర్మించారని ఆరోపించారు. శిఖం, బఫర్ జోన్లను ఆక్రమించి ప్రహరీని నిర్మించారని, ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల నర్సింహ, నాయకులు సతీశ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల సంరక్షణకు చర్యలు

షాబాద్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి వెంకటేశం సూచించారు. బుధవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కేజీల పొటాష్ రసాయన ఎరువులను వేసి మట్టితో కప్పాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న భజన మండలి సభ్యులు

చేవెళ్ల: శ్రావణమాసం మొదలైనప్పటి నుంచి ముగింపు వరకు ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందని చేవెళ్ల భజన మండలి సభ్యులు అన్నారు. చేవెళ్లలోని శివాలయం, హనుమాన్ దేవాలయాల్లో భజన మండలి సభ్యులు శ్రావణమాసం ముగింపు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆలయల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రావణమాసం ప్రారంభం నుంచి ముగింపువరకు ప్రతీ రోజు భజన కార్యక్రమాలను కొనసాగించినట్లు తెలిపారు. ఈ మాసం వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో భక్తిభావంతో నిండిపోయి ప్రజలు కూడా భజనలు చేయించుకుంటారన్నారు. నెలరోజుల పాటు భజన కార్యక్రమాలతో గడిచిపోయిందన్నారు. శ్రావణమాసం ముగిసిపోవటంతో ప్రస్తుతం గణేశ్, నవరాత్రి ఉత్సవాలు వస్తుండటంతో అక్కడ భజన కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు నరోత్తంరెడ్డి, భోజిరెడ్డి, జంగయ్య, భజన మండలి సభ్యులు తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మొయినాబాద్: అవగాహన కల్పిస్తున్న శ్రీలక్ష్మి



మొయినాబాద్‌రూరల్: మాట్లాడుతున్న కవిత

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి

మొయినాబాద్: పిల్లలకు పోషకాహారం అందిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం మంచిదని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని పిల్లలకు తప్పనిసరిగా పెట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

మొయినాబాద్‌రూరల్: పిల్లలకు పోషకాహారాన్ని అందించి ఆరోగ్యంగా పెంచినప్పుడే విద్యాబుద్ధులతో ఉన్నతస్థాయికి ఎదుగుతారని మండల అంగన్‌వాడీ టీచర్ల కార్యదర్శి కవిత పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ.. చిన్నపిల్లలను ఆరోగ్యవంతంగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. చిన్నతనంతోనే క్రమశిక్షణ అలవరిస్తే విద్యాబుద్ధులను చక్కగా నేర్చుకుంటారన్నారు. పిల్లల తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యవంతంగా పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధ్యాయులు లక్ష్మి, శ్యామల, మహిళా సంఘం అధ్యక్షురాలు మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆయా రజిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘మదర్’ డైరెక్టర్ పదవికి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న రాంరెడ్డి తదితరులు

కందుకూరు: ఉమ్మడి నల్గొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్(మదర్ డెయిరీ) డైరెక్టర్ పదవికి జిల్లా తరఫున మండల పరిధిలోని ఆకులమైలారంకు చెందిన ఎడ్ల రాంరెడ్డి బుధవారం మద్దతుదారులతో కలిసి హయత్‌నగర్‌లోని కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. మదర్ డెయిరీ సంఘం ప్రతినిధులు చేగూరి బీరప్ప, ఎండీ వహీద్, బుచ్చిరెడ్డి, సంజీవరెడ్డి, ఊట్లపల్లి కృష్ణయ్య, అరుణ, సుగుణమ్మ, నాయకులు అండేకార్ సురేందర్, రావుల జంగయ్య, గౌర శ్రీశైలం, బూచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.